# పశ్చాత్తాపం లేదు

శాంతాదేవి




ఆకాశంలో కారుమేఘాలు ఇప్పుడో, ఇంకాస్సే పటికో వర్షం వచ్చే సూచనగా దట్టంగా పరుచుకుని వున్నాయి. జట్కా తోలటం కష్టమై పోతోంది. బండిలో కూర్చున్న జానకి చలికి ముడుచుకు కూర్చుంది. ఆమె అన్న గోపాలం బండివాణ్ణి అడుగుతున్నాడు.

"ఇంకా ఎంతదూర ముంటుందోయ్?" బండి వాడేదో సమాధానం చెప్పాడు. జానకి సరీగా వినిపించుకోలేదు. ఆమె ఆలోచనల్లో శంకరం వున్నాడు. ఇంకా కొద్దిగంటల్లో అతన్ని కలుసుకోబోతోంది. తన సంవత్సర కాలం నిరీక్షణ ఫలిస్తుందా, లేక బెడిసికొడుతుందా? జరిగిం దానికి తను బాధపడటం లేదు. జరగబోయేదాని కోసం ఆశతో నిరీక్షిస్తోంది... జానక్కి జరిగిపోయిన ఆ క్షణాలు తల్చుకుంటే ఒళ్లు గగుర్పొడిచింది.

"అయితే మనం వెళ్ళేసరికి ఆస్పత్రి తెరిచి వుంటుందంటావా?" గోపాలం ప్రశ్నిస్తున్నాడు, జానకి ఆసక్తిగా వింటోంది అతని జవాబుకోసం. బండివాడన్నాడు.

"అదేమో చెప్పలేం బాబయ్యా! చాలా రాత్రయిపోనాది గదా!" మెల్లిగా అన్నాడు. జానకి నిరాశగా నిట్టూర్చింది.

"రైలు లేటయిందోయ్" గోపాలం అంటున్నాడు. రివ్వున ఈదురుగాలి వీచటంతో జానకి వులిక్కిపడి మరింత ఒదిగి కూర్చుంది.

"ఈవర్షమూ, గాలీ చూస్తుంటే ఏ వేళకి చేరతామో అనిపిస్తుంది" భగవంతుని మనస్ఫూర్తిగా వేడుకుంది జానకి. తన భర్తని కలుసుకోబోయే ఆ శుభ క్షణాలు త్వరలో రావాలని. ఆమెకు భర్త తలపుకు రాగానే ఒక్కసారిగా అతని రూపమూ, అతన్ని మొదటిసారి తను ఎటువంటి పరిస్థితిలో కలుసుకున్నదో అన్నీ కళ్ళకు కట్టినట్టు కనిపించాయి...ఆ రోజు, అందరి ఆడపిల్లల్లాగే తనూ స్వర్గసుఖా లనుభవించాలని కలలు గంది. కానీ అలా జరుగుతుందని ఎవరికి తెలుసు? తన తండ్రి మాత్రం! ముందుగా ఏ మాత్రం తెలిసివున్నా వున్న ఒక్కకూతుర్ని అటువంటి మతిలేనివాడికిచ్చి చేస్తాడా? జానకి మనసు గతాన్ని చీల్చుకుని పరుగెత్తింది......

జానక్కి ఆ క్షణాలు బాగాగుర్తు. పెళ్ళిపీటల మీద అతన్ని సరీగా చూడకపోయినా తరువాత అతని ప్రవర్తన విచిత్రంగా కనిపించేది తనకు ...భయంకరమైన ఆ రోజులు తల్చుకుంటే ఇప్పుడే ఆ బాధ అనుభవిస్తున్నట్టు అనుభూతి కలుగుతుంది. రెండునెలలు నరకంలో గడిపింది ... తనతో మాట్లాడుతూనే వున్నట్టుండి తన వంక విచిత్రంగా చూసి అక్కడినుండి లేచి వెళ్ళిపోయేవాడు.

అదేమిటో అర్థంకాక వెనకాలేవెడితే.అక్కడ గోడతోనో, కుర్చీతోనో సంభాషణ చేస్తూండేవాడు...... జానకి మొదటిసారిగా అతనిచేతిలో దెబ్బలుతిని, అప్పుడు జీవితంలో నిరాశ పెంచుకుంది. జానకి రాసిన వుత్తరం చదువుకుని ఆఘమేఘాలమీద వూడిపడ్డాడు ఆమె తండ్రి.

అల్లుణ్ణి చూచాకగానీ ఆయనకి అసలుసంగతి తెలీలేదు.......

ఆ తర్వాత ఎంతగా పోట్లాటలు, ఎన్ని మనస్పర్థలు... తండ్రి మామగార్ని ఎన్నిమాటలన్నాడు. ఆయన మాటల్లో ద్వేషంకాక, కూతురి జీవితం ఏమవుతుందో నన్నఆవేదనే ఎక్కువగా ధ్వనించింది....... తన తల నిమురుతూ, ఆడదానిలా వెక్కివెక్కిఏడ్చాడు. తండ్రి ఆ యింటి నుండి వచ్చేస్తుంటే, అత్తవారింటికి వెళ్ళినట్టే వెళ్ళి రెండునెలలైనా గడవకముందే తిరిగి పుట్టింటికి వచ్చివేయటం,జీవచ్ఛవంలా కాలంగడపటం అంతా కలలా గడిచిపోయింది.... జానకితండ్రి గుర్తుకురాగానే కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి. చివరికి తన వేదనతోనే ఆయన కాలంచేశాడు. ఆఖరి క్షణాల్లో కూడా ఆయన పడ్డఆవేదన. తన కోసం ఆయన పడ్డ తపన... తను ఏనాటికైనా మర్చిపోగలదా!

"చూస్తూ, చూస్తూ పువ్వులాంటి నాతల్లిని అటువంటి త్రాష్టుడికిచ్చి చేశాను. దాని జీవితమేమవ్వాలి.?"

చనిపోతూకూడా ఆయన తనకోసమే విచారించాడు. జానక్కి ఆయనకేవిధంగా చెప్పాలో కూడా తెలిసేదికాదు. చాటుగా కన్నీళ్ళు తుడుచుకోవడంతప్ప తనుమాత్రం ఏం చెయ్యగల్గింది?

# పశ్చాత్తాపం లేదు

తర్వాతరోజు ఎట్లా వెళ్ళబుచ్చిందో తనకే తెలియాలి......

"దిగండమ్మా..." ఆస్పత్రి గేటు తెరిచేవుండటంతో కొంత తృప్తిపడి జానకి మనసు తేలికపడింది.

ఇద్దరూ సరాసరి డాక్టరు దగ్గరకేవెళ్ళారు... గోపాలం ఎంతబ్రతిమాలినా ఆయనఒప్పుకోలేదు. జానకి ప్రాధేయపడింది ఒక్కసారి చూసివస్తామనీ, మాట్లాడించమనీ డాక్టరు నిరాకరించాడు.

"విశ్రాంతి తీసుకుంటున్న పేషెంటుని లేపనీయను. ఇప్పుడే నిద్రపట్టిందాయనకు......" తామెవరమో డాక్టరుకు చెప్పి లాభంలేదనుకున్నాడు గోపాలం. చేసేది లేక ఇద్దరూ అడ్రసు వెతుక్కుంటూ జానకి అత్తవారింటికి వెళ్ళారు.

తలుపులువేసి వున్నాయి. తలుపు కొట్టాలంటే చెయ్యి వణికింది గోపాలానికి, ఇన్నాళ్ళకి తిరిగి ఆ యింటికి... మనసులో ఏదో సంకోచం ...

జానకి కొద్దిదూరంలో నిల్చుంది. ఇన్నాళ్ళకి తిరిగి వచ్చిన తనను సానుభూతితో ఆదరిస్తారా అత్తమామలు. ఆమెలో ఏదో మొండి ధైర్యం ప్రవేశించింది. తన భర్తకోసం, తను ఏం చేసైనాసరే, తన సంసారం నిలబెట్టుకోవాలనుకుంది.

......తలుపులు తెరుచుకున్నాయి. అవతలి మనిషి "ఎవరూ" అంటూ వెలుగులోకి వచ్చి ఇద్దర్నీ పరీక్షగా చూశాడు. కొద్దిసేపు పోల్చుకోలేకపోయినా గుర్తుపట్టిన వెంటనే అతని మొహంలో రంగులు మారాయి. గోపాలం పరీక్షగా ఆయన మొహంలోకే చూస్తున్నాడు.




జానకి మామగారివేపు చూసేధైర్యం లేక తల వంచుకు నిలబడింది.

"మీరా...చాలా రోజులకి రండి లోపలికి" అంటూ లోపలికి నడిచాడాయన. జానకి బెరుగ్గా అడుగులు వేసింది. ఒకప్పుడు ఈ యింట్లోకి స్వతంత్రంగా ప్రవేశించింది. జానకి లోపలకి అడుగులు వేసింది. గోపాలం అక్కడున్న కుర్చీలో కూర్చున్నాడు. ఆయనతో ఏవిధంగా సంభాషణ కదపాలో అర్థంకాకుండా వుంది. చాలాసేపయినాక ఆయన అన్నాడు.

"ఇదేనా రావటం, రైలులేటయినట్టుంది..." ఆయన సంభాషణతీరు చూస్తుంటే ఇంటికివచ్చిన వాళ్ళతో తప్పనిసరిగా మాట్లాడుతున్నట్టుంది.

"అవునండీ. ఆస్పత్రికి వెళ్ళివచ్చాం..." ముసలాయన ముఖం చిట్లించుకున్నాడు.

"కానీ శంకరాన్ని చూట్టానికి వీల్లేకపోయింది ఆయన నిద్రపోతున్నారని డాక్టరు వల్లకాదన్నాడు......"

"అలాగా?"

"వారం రోజుల క్రిందటే తెలిసింది మాకీ సంగతి. అప్పుడే రావాలనుకున్నాం– కానీ, నాకేవో పనుల్తో తీరికలేకపోయింది... ఇదంతా మా అదృష్టం అనుకుంటున్నాం. తిరిగి మనం ఇలా కలుస్తామనుకోలేదు. ..." గోపాలం ఆయన మొహంలోకి చూశాడు. ఆయన మొహంలో ఎటువంటి భావాలూ వ్యక్తంకావటం లేదు. అసలు తన మాటలు సరిగా వినిపించినాయో లేదో అన్న అనుమానం కూడా కలిగింది గోపాలానికి. ఆయన తరహా చూస్తే అలా వుంది.

"జానకి మనిషి అక్కడున్నదన్నమాటే గానీ. దాని ప్రాణాలన్నీ ఇక్కడే వున్నాయి, సంగతి తెలిసిన నాటినుంచీ... " గోపాలం ఆగాడు.

"పొద్దుపోయింది. పక్కలు వేశాను, పడుకోకూడదూ ?" జానకి అత్తగారు లోపలనుండి వస్తూ అంది. గోపాలం లేచాడు. తను ఎంత మాట్లాడినా జానకి మామగారు ముక్తసరిగా మాట్లాడటం గమనించాడు... మౌనంగా తనకు వేసిన మంచం వద్దకు నడిచాడు. జానకి అదే గదిలో వేరే మంచం మీద పడుకుని నిద్రపోతోంది. గోపాలం మనసు అసంతృప్తిగా వుంది. జరిగిందేదో జరిగింది. అతను ఈ ప్రమాదం నుండి బయటపడటమే గాక, జానకి అదృష్టం బాగుండి అతని మతి స్థిరం కూడా వచ్చింది. పూర్వపు పిచ్చిగుణాలు పోయాయి. మనిషి సరిగా వున్నాడు; కానీ వీళ్ళ ధోరణి చూస్తే జానకి కాపురం సానుకూలపడేలా లేదు.

...తెల్లవారింది జానకి అమితోత్సాహంతో లేచింది. కానీ ఆమె వుత్సాహం కొద్దిసేపట్లోనే చల్లబడింది. గోపాలానికీ, జానకి మామగారికీ తీవ్రంగా వాగ్యుద్ధం జరిగింది. చివరికి తేలిన సారాంశం...

"కష్టంలో వదిలిపెట్టి, మీ నాన్న తన

కూతురికి పెళ్ళి కాదంటానని నానా మాటలూ, నన్ను నా కొడుకునీ అని ఇప్పుడు మా గీత బాగుండబట్టి వాడి పరిస్థితి బాగుపడితే మళ్ళీ వాడికోసం... ఆ నాడు ఏమి ఆలోచించి కూతుర్ని తీసుకుపోయారయ్యా! వాడి మొహం కూడా చూట్టానికి వీల్లేదు..." జానకి కృంగిపోయింది.

గోపాలం అవమానంతో తలవంచుకుని బయటకు వచ్చేశాడు. జానకి అతని వెనకే నడిచింది...కానీ వారు స్టేషన్‌వేపు నడవలేదు. కనీసం అతన్ని కలుసుకున్నా తనువచ్చిన కార్యం ఫలిస్తుందేమోనని ఆశతో గోపాలం చెల్లెల్ని వెంటబెట్టుకుని అప్పత్రికి బయల్దేరాడు.. జానకి గుండె వేగంగా కొట్టుకుంటోంది జరగబోయే క్షణాల్ని_తల్చుకుని. అతనుతనని ఏ విధంగాచూస్తాడు. పెళ్ళయిరెండేళ్ళయినా, అతని వద్ద రెండు నెలలు గడిపినా, నిజంగా భర్తతో పరిచయం ఈనాడే మొదలు! అతని ఎదురుగా ఎలా నిలబడగలుగుతుంది? అతను తనని ఆదరిస్తాడా? అతని హృదయంతో ఎటువంటి స్థానం సంపాదించుకో గలుగుతుంది? ఆమెకు అన్నీ ప్రశ్నలే! జవాబులులేవు...గేటుదాటి లోపలకు నడిచారు. వుదయ సూర్యునికాంతి లేతగా ప్రసరిస్తోంది ఆవరణలోని మొక్కలమీద రాత్రి పడిన మంచు మూలాన ఆకులమీద నీటి బిందువులు మిలమిల మెరుస్తున్నాయి ... గదిముందు వచ్చి ఆగాడు గోపాలం...అంతవరకూ గదిలో నిలబడ్డ నర్సు బయటకు వెళ్ళిపోయింది ఇద్దరూ లోపలకి నడిచారు, జానకి మొహమంతా చిరుచెమటలు పట్టింది. తలవంచుకు నిలబడింది... శంకరం గోపాలాన్ని అర్థంకాని చూపుల్తో చూశాడు. అతని మొహంలో ఎటువంటి మార్పూ రాలేదు. తిరిగి దృష్టి మరల్చుకుని ఎటో చూస్తున్నాడు. జానకి అతని మొహంలోని మార్పుల కొసం పరీక్షగా చూస్తోంది. ఆమె ఆశ నిరాశ అయింది. అతను ఆమెను గుర్తించలేదు సరిగదా, కనీసం ఎరిగున్నవాడిలా కూడా మొహం పెట్టలేదు. జానకి కృంగిపోయింది. గోపాలం కనిపెట్టాడు ఆమె మనసు. ఇంక వూర్కుంటే లాభం లేదనుకున్నాడు.

"ఈమె ఎవరో మీకు గుర్తుండి వుండవచ్చు..." అన్నాడు. శంకరం ఆశ్చర్యంతో చూశాడు ఆమెవేపు. గోపాలం అతని మొహంలోకే చూస్తున్నాడు. జానకి మనసు కొట్టుకుపోతోంది తన భవిష్యత్తు ఈ ఒక్కక్షణంమీద ఆధారపడివుంది. అతనికి కొద్దిగా గతచరిత్ర జ్ఞాపకం వుండివుంటే భార్యని గుర్తించగలడు. జానకి కళ్ళెత్తి చూసింది. అదే క్షణాన అతనూ ఆమె మొహంలోకి చూశాడు.అతన్ని మొహంలో గానీ, కళ్ళల్లోగానీ ఏవిధమైన చిన్నమార్పూలేదు జానకి తలకొట్టేసినట్టయింది. వెంటనే ఎవరికీ కనపడనంత దూరంగా, ఎవరూలేని చోటికి పారిపోదామా అన్నంత నిరాశ ఆవహించిందామెను...గోపాలం మొహంలోకూడా నిరాశ చోటుచేసుకుంది. చెల్లెలు మొహంలోకి చూళ్ళేక తల వంచేసుకున్నాడు.

"ఈమె..." అంటూ మొదలెట్టాడు. అతని మాట పూర్తికాలేదు.

"అన్నయ్యా..." జానకి చూపులతోనే వారించింది. శంకరం ఇదేమీ అర్థం కానట్టు పైకప్పుకేసి చూస్తున్నాడు. గోపాలం లేచాడు. అతనివెనకే జానకి నడిచింది... బయటకొచ్చాక గోపాలం ఆమెకెంతో నచ్చజెప్పాడు. కానీ జానకి ససేమిరా వినలేదు... ఆమె సంసారం నిలబెట్టటానికి నిజం బయటపెట్టి జరిగిన సంఘటనలు అతనికి తలపుకు తీసుకొచ్చి, ఆమె భార్య అని చెపితే అతను గుర్తించవచ్చు. ఆ విధంగానైనా జానకి సుఖపడుతుందని గోపాలం వుద్దేశం. కానీ, అభిమానంగల జానకి అందుకు ఒప్పుతోలేదు...

"వద్దన్నయ్యా! ఎప్పటికైనా ఆయనకు నేను గుర్తుకువచ్చి, ఆయన కిష్టమైతేనే వస్తాను... అంతవరకూ నాకీ యింటిలో స్థానంలేదు..." జానకి, కళ్ళల్లో నీటి బిందువులు మెరిశాయి. గోపాలం ఏం మాట్లాడలేకపోయాడు. ఇద్దరూ వెంటనే బయల్దేరారు. జానకి వచ్చేటప్పుడు చాలా వుత్సాహంతో, అంతకుమించిన ఆదుర్దాతో వచ్చింది. కానీ తిరిగి వెళ్ళేటప్పుడు ఆమె మనసులో ఏ ఆలోచనాలేదు. నిర్వికారంగా చూస్తోంది... అటు తరవాత ఆమె శంకరాన్ని చూడలేదు. చూసే అవసరంకూడా లేకపోయింది... ఎందుకంటే ఒకనాడు గోపాలం ఆఫీసునుండి వస్తూనే జానక్కి శుభలేఖ అందించాడు. చూస్తూనే జానకి కొయ్యబారిపోయింది. శంకరం మళ్ళీ పెళ్ళిచేసుకుంటున్నాడు. భార్యవుండగా మళ్ళీ పెళ్ళిచేసుకుంటున్నాడు... ఇది జరక్కుండా ఆపగలశక్తి తనకు వుంది. కానీ... ఎందుకు? ఎందుకాపాలి? తనకీ, అతనికీ ఏం సంబంధం వుందని ఆపాలి? జానకి ఏం మాట్లాడకుండా లేచి వెళ్ళిపోయింది. గోపాలానికి తెలుసు. ఈ వార్త చెల్లెలికెంత హృదయవేదన కలిగిస్తుందో! కానీ తనేం చెయ్యగలడు. ఆనాడు చూస్తూ, చూస్తూ మతిలేని వాడి కప్పగించలేకపోయాడు. ఈనాడు ఆమె దిక్కులేనిదవుతుంటే చూస్తూ వూర్కోక ఏం చెయ్యగలడు?... గోపాలం జానకి వెనకనే వెళ్ళాడు మెల్లిగా. జానకి దొడ్డి గడపలో కూర్చుని మోకాళ్ళలో తలదూర్చుకుని వెక్కివెక్కి ఏడుస్తోంది. ఆమెను ఓదార్చేవారెవరూ లేరు. వుత్తమాటలతో పోయే బాధ కాదది. అయినా తన బాధ్యత తనకు వుంది. నెమ్మదిగా ఆమె తలమీద చెయ్యివేసి నిమిరాడు.

"అమ్మా! జానకీ." జానకి తలెత్తలేదు. అన్న ఓదార్పుమాటలతో ఆమె దుఃఖం మరింత హెచ్చింది.

"మనం చేసేదేమీ లేదమ్మా!... అంతా అయిపోయాక......నీ జీవితం నాశనం చేశాం...., "జానకి మాట్లాడలేదు,

......అతర్వాత జానకి శంకరాన్ని గూర్చి ఆలోచించడం కూడా మానుకుంది. ఇన్నాళ్ళూ అతనికోసం, అతని పిలుపుకోసం ఎదురు చూసింది, ఎప్పటికైనా అతని మనసు మారవచ్చనీ. తనకోసం వస్తాడనీ అనుకుంది. ఇంక ఆ ఆశలేదు.......

రోజులు ఎప్పుడూ ఒక మాదిరిగా గడవవు. శంకరంతండ్రి జబ్బుతో తీసుకుంటూ, ఒకనాడు అసలు నిజం బయటపెట్టి కొడుకుని క్షమాపణ వేడుకుని పరలోకం దాటాడు. అయన ఆ నిజాన్ని కడుపులోనే వుంచుకున్నా శంకరం జీవితం సాఫీగా గడిచిపోయేది,... తండ్రిమాట వింటూనే కొయ్యబారిపోయిన శంకరానికి వెంటనే ఏమనటానికీ పాలుపోలేదు. అతనికి ఒక్కసారిగా గతమంతా కళ్ళముందు తిరిగింది. జానకి గుర్తుకు రాగానే, ఆమెతో వివాహం ఆతర్వాత ఆమెతనతో కొన్నాళ్ళు గడపటం ....తనకు పిచ్చిముదరటం...ఆ తర్వాతరోజులు గడుస్తున్నకొద్దీ తను భార్యనే గుర్తుపట్టలేని స్థితి రావటం...... శంకరం నిజంగానే పిచ్చెక్కినట్టు బాధపడ్డాడు. జానకి ఎంత బాధపడి వుంటుందోగదా తన తండ్రి ఆమెకు చేసిన విఘాతానికి. శంకరం విలవిల్లాడిపోయాడు. ఈసంగతి ఒక్క ఏడాదిముందు తెలిస్తే తనకీ ఆవేదన వుండేదికాదు. తన జీవితాన్ని దుఃఖమయంచెయ్యటానికి కాకపోతే తండ్రి తనకోసం గతం ఇప్పుడెందుకు తెలియపరచాలి?... ఒక్కసారి ...జానకిని చూడాలనేకాంక్ష ఆపుకోలేకపోయాడు.....

జానకి అతన్నిచూసి ఒక్క క్షణం నిలబడిపోయింది కదలకుండా. అతను తిరిగి ఎందుకు వచ్చినట్టు తనలో మానుతున్న గాయాన్ని రేపటానికి కాకపోతే!

"నన్ను క్షమించు జానకీ! మా నాన్న నాకీ విషయం చెప్పగానే నాకు తిరిగి మతి భ్రమిస్తుందేమోనని భయపడ్డాను..." జానకి మాట్లాడలేదు

"నాకీ సంగతి ముందుగా తెలిస్తే మన జీవితాలు వేరు విధంగా వుండేవి. మనిద్దరి జీవితాల్ని అన్యాయం చేశాను.

"..............."

"కానీ నేనిప్పుడేం చెయ్యలేను. పరిస్థితి నాచెయ్యి దాటిపోయింది. ...వసుంధర అతని కళ్ళల్లో మెదిలింది.

"నన్నింక మర్చిపో జానకీ..."

"ఆ పని ఎప్పుడో చేశాను..." జానకి ఎంత బాధతో ఆ మాట అన్నదంటే,

"మీరు వెళ్ళిపోండి. మీకు పూర్వం పెళ్ళయిందనీ, ఒక భార్య వుండేదన్న విషయమేమీ జ్ఞాపకంలోకి రానివ్వకండి..." అనేసి చరచరా లోపలికి వెళ్ళిపోయింది.

శంకరం స్థాణువులా నిలబడిపోయాడు.